# జరిగిన కథల కథ



అంగర
వెంకట శివ ప్రసాదరావు

గోపాలరావుతో నాకు పరిచయం చాల విచిత్రంగా జరిగింద. ఆఫీసుపనిమీద హైద్రాబాద్ వెళుతున్నాను.

విజయవాడ స్టేషన్లో ఏమీ తోచక ఏదో తెలుగుపత్రిక కొన్నాను. పత్రిక తిరగేస్తుంటే లందమైన బొమ్మతో ఏదోకథ కనిపించింది. అందమైన బొమ్మలున్న కదలు కనిపిస్తే తప్పక చదువుతాను.

కథ సాపీగాన నడుస్తోంది. ఫరవాలేదని పించింది. వాస్తవానికి దగ్గరగానే ఉంది. అంతసేపూ నాపక్కన కూర్చున్న వ్యక్తి నావేపే ఆసక్తిగా చూస్తున్నాడన్న విషయం గ్రహించలేదు. తెలిసిన తరువాత పత్రిక చూస్తున్నాడేమో అనుకున్నాను. మనవాడికి జన్మలో పుస్తకం కొని చదవడం రాదు.

పత్రిక చదవడం పూర్తిచేసి మడిచి చేతోపట్టుకున్నాను. నేను వూహించినట్లు నాపక్కనున్న వ్యక్తి పత్రిక అడగలేదు.

"కథ ఎలావుందండీ ... ?" ఆత్రుతగా అడిగాడు.

"ఏకథ ... ?" అడిగాను.

"అదే . . యిందాక మీరు చదివేరే 'దొంగ'కథ...అది "

"బావుంది...ఫరవాలేదు...మీరు చదివేరా అది !" కాలక్షేపం కోసం మాటలు పెంచేను.

"నాపేరు గోపాలరావు..." నవ్వుతూ

'అలాగా. .' ఎంతో మామూలుగా అన్నాను. అంటూ అతని మొహంలో ఆశ్చర్యం చూసాను. ఎందుకో అర్థంకాలేదు.

"ఆకథరాసిన రచయిత ఎవరండీ ?" ఒక్కనిముషం ఆగి అన్నాడు.

"వెనకటికి ఎవరో అన్నట్టు ... వీధికో డాక్టరు, చెట్టుకో ప్లీడరు అన్నట్టు కలానికో రచయిత అన్నట్టు తయారైపోతున్న ఈ తెలుగు దేశంలో ఎంతమంది రచయితల్ని గుర్తుపెట్టుకో మంటారు కాలక్షేపం కోసం చదివినకథ రచయిత ఎవరైతేనేం" నవ్వుతూ అన్నాను.

"ఆపత్రిక ఓ సారి చూడనిస్తారా ...?"

పత్రిక యిమ్మని అడక్కూడదూ ... ఎందుకొచ్చిన డొంక తిరుగుడు అని లోపల అనుకుంటూ పత్రిక ఇచ్చాను.

అతను పత్రిక పేజీలు తిరగేస్తున్నాడు. నేను కిటికీలోంచి పరిగెడుతున్న ఎలక్ట్రిక్ స్తంభాల్ని చూస్తున్నాను.

"ఈ కథ కీబొమ్మ బాగుంది కదండీ" ... అన్నాడతను. పత్రిక వేపు చూసాను. 'దొంగ' కథ బొమ్మ తోపాటే రచయితపేరు చూసాను. "గోపాలరావు" అని వుంది. అప్పుడర్థమైంది. ఆ కథరాసింది అతనే అని.

'క్షమించండి . . ఆ కథ రాసింది మీరనుకోలేదు...' ఆతనేం అనుకున్నాడో అని బాధపడుతూ.

"పరేంఫరవాలేదు. ." లేని నవ్వు తెచ్చి పెట్టుకుని అన్నాడు "ఈకథ వాస్తవానికి దగ్గరగానే వుంది. ." ఏం అనాలో తెలీక అలా అన్నాను. "కరెక్ట్ మీరన్నది. ఈ మధ్య మా బంధువుల యింట్లో పెళ్ళికి వెళ్ళినప్పుడు యిలాగే జరిగింది. ముగింపు కల్పనే అనుకోండి..." నవ్వుతూ అన్నాడు.

* * *

హైద్రాబాద్‌లో నేను వున్న రెండు రోజులు నా బస గోపాలరావు ఇంట్లోనే ... అతనికి ఏదో కంపెనీలో వుద్యోగం. చిన్న సంసారం, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు.

## ఇంటింటి చిట్కాలు

★ మరుగుతున్న నీళ్ళలో ఎండిన నారింజ తొక్కను ఒక నిమిషం సేపు వుంచి ఆ నీటితో 'టీ' కాచుకుంటే చక్కటి సువాసనగల 'టీ' లభిస్తుంది. మిగిలిన టీ పొడిని గులాబీ మొక్కలకు ఎరువుగా వాడ వచ్చును.

★ ఒక పది బియ్యపు గింజలు ఉప్పు జాడీలో వుంచితే మెత్తని ఉప్పు, గడ్డలు కట్టకుండా పొడిగా వుంటుంది.

★ పప్పుదినుసులు, కూరగాయలు ఉడి కించేటప్పుడు రెండు మూడు చుక్కలు కొబ్బరినూనె జోడిస్తే త్వరగా వంట అవుతుంది.

★ పాలు కాచుకునేటప్పుడు, చిక్కటి పాలు అడుగుపట్టి కాటు వాసన వస్తూ వుంటాయి. అట్లా రాకుండా పాలు కాచేముందు గిన్నెలో కొంచెము నీళ్ళుపోసి ఆ తరువాత పాలుపోసి కాచితే అడుగు పట్ట కుండా వుంటాయి. కాటు వాసన రావు.

★ నిమ్మకాయలు తాజాగా వుండా లంటే, చల్లని నీళ్లలో వుంచి, ప్రతిరోజూ ఆ నీళ్ళను మార్చుతూ వుంటే నిమ్మకాయలు చెడిపోవు. రసం ఆరిపోదు.

★ అప్పడాలు పొడి పొడిలాడుతూ విరిగి పోకుండా, తాజాగా వుండాలంటే వాటిని పోలిథిన్ కాగితంలో వుంచి, బియ్యంలోగాని, పప్పులలో గాని నిల్వచేస్తే ఎన్నాళ్ళయినా తాజాగా వుంటాయి. చెడిపోవు. పురుగు పట్టదు.

★ ఉల్లిపాయలకు ఆరారగా వంట నూనె రాసి, ఒక పది నిమిషాలు ఎండలో ఆరబెట్టిన పిదప గట్టిగా రుద్దితే తొక్కలు ఇట్టే ఊడి పోతాయి. వాటిని తరిగేటప్పుడు మన కళ్ళకు బాధ కలిగించవు. కన్నీళ్ళు రావు. ఆవపిండి రాసు కుంటే చేతులకువున్న ఉల్లిపాయ వాసన పోతుంది.

— యం. సరస్వతి

## జరిగిన కథల కథ

చీకూ చింతా లేని సంసారం. హాబీగా కథలు రాస్తాడు. అతని భార్య చాలా చక్కగా మాట్లాడుతుంది. ఆవిడకు అతని కథలంటే పరమ చిరాకు.

హైదరాబాద్ నుండి వచ్చేస్తున్నప్పుడు అతనికి నా ఎడ్రస్సిచ్చాను. అప్పుడప్పుడు వుత్తరాలు రాయమని ...

నేను విశాఖ వచ్చిన పదిరోజులకే అతని దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. పత్రిక వాళ్లు అతని కథ ప్రచురిస్తున్నట్లు వుత్తరం రాసేరట.

ఆ కథని టూకీగా వుత్తరంలో రాసేడు. ఆ మధ్య వాళ్లు పల్లెటూరు వెళ్ళినప్పుడు అక్కడ జరిగిందిట. అదే జరిగింది జరిగి నట్లు రాసేసాడట. గోపాలరావు విచిత్రమైన వ్యక్తి.

ఆ తరువాత గోపాలరావు దగ్గర్నుంచి తరుచూ వుత్తరాలు వస్తూనే వున్నాయ్. నేనూ అతనికి రెండు మూడు వుత్తరాలకి ఒక జవాబు రాస్తూనే వున్నాను.

కథలు వాస్తవానికి దగ్గర్లోనే వుండాలని, కాని అవి జరిగినవి జరిగి నట్లు రాసేస్తే...కొన్ని కొన్ని పరిస్థితులలో నీ కథల ముగింపు వాళ్ల జీవితాలకి ముగింపు కావచ్చుని...కథకి కల్పన అవసరమని ఎన్నో విధాల అతనికి రాసాను.

నేనన్నట్టుగానే జరిగిందోసారి ... గోపాల రావు తోడల్లుడు తమ్ముడు ఎవరో అమ్మా యిని ప్రేమించాడట. దానికి వాళ్ల తోడ ల్లుడు వొప్పుకోలేదట. ఆ యింట్లో పెద్ద గొడవ జరిగిందిట.

అదంతా గోపాలరావు కథగా రాసాడు. ఎంత పేర్లు మార్చినా కథ కళ్లకుకట్టినట్లు కనిపిస్తూంటే తెలీదూ...ఆ కథకి ఓ చక్కని ముగింపు కావాలని గోపాలరావు వాళ్ల తోడ ల్లుడికీ, తమ్ముడు ప్రేమించిన ఆ అమ్మా యికి అక్రమ సంబంధం కలిపాడు.

ఆ కథ ప్రచురించబడినది. కథముగింపు బావుందంటూ ఎన్నో వుత్తరాలు కూడా వచ్చాయి.

వాళ్ల తోడల్లుడు గోపాలరావుమీద కేసు పడేసాడు. అది తప్పించుకునేసరికి గోపాల రావుకి తలప్రాణం తోక్కి వచ్చింది.

అయినా గోపాలరావు కథలు రాయడం మానలేదు. కొన్నాళ్లపాటు గోపాలరావు నాకు వుత్తరాలు రాయడం మానేసాడు. అప్పు డప్పుడు అతని కథలు పత్రికల్లో చదువు తున్నాను.

మునుపట్లా ఫలానా కథ ఫలానా ఇంట్లో జరిగింది...అని గోపాలరావు దగ్గరనుండి వుత్తరాలు లేకపోవటంవల్ల ఏ కథ జరిగిందో... ఏ కథ గోపాలరావు కల్పించిరాసాడో తెలీటం లేదు.

హఠాత్తుగా గోపాలరావు కథలు పత్రికల్లో కనిపించడం మానేసాయి. కనీసం నెలకి రెండో మూడో కథలేనా ఏదో పత్రికలో కని పించేవి. అలాంటిది మూడు నెలలు పైనే అయివుంటుంది అతనికథ చదివి.

కథలు రాయటం మానేశావా? అని వుత్తరం రాద్దామనుకున్నాను. 'ఇంటికీ, ఒంటికీ మంచిదని మానేశాడేమోనని అను కున్నాను.

ఆ తరువాత సరిగ్గా పదిరోజులకి అను కుంటాను అతని కథ పత్రికలో పడింది. 'బాలి' బొమ్మ ముచ్చటగా వుంది. కథపేరు 'ప్రేమ.'

ఆత్రుతగా చదివేసాను కథ. ఈ కథలో గోపాలరావు రచయితగా ఎదిగాడనిపించింది. ఇంత మంచి కథ అతను మునుపెప్పుడూ రాయలేదు.

కథావస్తువు కొత్తదేంకాదు. ప్రేమంటే తెలిసీ తెలియని వయసులోవున్న పదహారేళ్ల అమ్మాయి లారీ డ్రైవరుతో లేచిపోయింది.

అంతే చక్కని కథ. చక్కని శైలి. కథ చదువుతూంటే ఒళ్ళు జలదరించింది. కథ బావుందంటూ వుత్తరంరాసి పోస్టు చెయ్య డానికి బద్ధకంవేసి డ్రాయర్లోనే వుంచేసాను.

రెండు రోజుల తరువాత గోపాలరావు దగ్గర్నుంచి వుత్తరం వచ్చింది. ఏవుంది ... మామూలే... పత్రికలోపడ్డ కథ ఫలానా వాళ్లింట్లో జరిగిందని రాసుంటాడు.

కవరు చింపి, వుత్తరం చదివి నిర్ఘాంత పోయాను. ప్రేమకథ ఎక్కడో జరగలేదు. ఆ కథ గోపాలరావు కూతురు కథే!